మినీకథ



# ఎదురు తిరిగిన కథ

## కిషన్

"ఈ సంగతి విన్నారా!" అంటూ హడావుడిగా లోపలికి వచ్చింది అనసూయ.

ఏ సంగతి అని నేను అడుగలేదు. అసలు ఆ అవసరమే లేదు. ఒక విషయం మొదలెట్టిందంటే మనం వద్దన్నా చెప్పకుండా వదలడం అనసూయ జాతకంలోనే లేదు.

ఆమె జన్మ నక్షత్రమే అలాంటిది కాబోలు. ఆమె గొంతు విని చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి ఏమిటా అన్నట్టు చూశాను.

"హవ్వ! ఇదేం చిత్రమండీ. మనకు మాత్రం పిల్లలు లేరా ఏమిటి! ఊళ్లో ఎంతమంది లేరని. ఇంత చోద్యం నేనెక్కడా చూడలేదు సుమా!" అంటూ మంచంమీద కూర్చుంది. ఉపోద్ఘాతమే ఇంత ఘాటుగా వుందంటే ఇవాళ ఎవడికో మూడిందని అనుకున్నాను.

ఈవిడగార్ని అంత కదిలించిన సంఘటన ఏపై వుంటుందా అని ఆలోచించడం వ్యర్థం! పక్కింటివాడికి లాటరీ తగిలితే, "ఆ! ఏముంది లెద్దురూ! నడమంత్రపు సిరి" అని పెదవి విరిచిన రోజులున్నాయి. సినిమాకు వెళ్లిన పొరిగింటావిడకు టికెట్లు దొరికితే ఆవిడ అదృష్టాన్ని మూడు రోజులు పొగిడిన సందర్భాలు కూడా వున్నాయి. అనసూయ జోరును బట్టి జరిగిందేమిటో ఊహించడం బ్రహ్మతరం కూడా కాదు. అదేమిటో ఆమె నోటనే వినాలి. కట్టుకున్న కర్మానికి తప్పదు కనక పుస్తకం పక్కన పడేసి గీతోపదేశం సమయంలో అర్జునుడి పోజులో కూర్చున్నాను.

"మన రుక్మిణమ్మ కూతురండీ-అదే వాసుదేవరావు భార్య రుక్మిణమ్మ కూతురండీ...మొన్న మొన్నటిదాకా వోణీలైనా వేసుకోలేదు....చూశారా! ఈ పోగాలం రోజులు. కలికాలం అని ఊరికే అన్నారా!" అంటూ ఆగింది. నేను వింటున్నానో లేదోనని ఒకసారి పరీక్షించి మళ్లీ ప్రారంభించింది.

"దానికి పెళ్లే కాదనుకున్నదా! అవ్వా అయ్యా పోయారనుకున్నదా! ఎలాంటి వంశంలో పుట్టింది– ఇలాంటి పనా చేయడం! అయినా తల్లిదండ్రులకు బుద్ధి వుండాలి. పిల్లలను మొదటి నుంచి అదుపాజ్ఞలలో పెట్టుకోవాలి కాని, ఇప్పుడు నెత్తీ నోరు బాదుకుంటే ఏం లాభం" అని ఓ సారి వీధివైపు చూసింది.

వింటున్నకొద్దీ నాక్కూడా కొంచెం ఆసక్తి కలిగింది. ఏదో సంచలన వార్తే తెచ్చివుంటుందన్న నమ్మకం కూడా కుదిరింది. ఇంతకూ జరిగిందేమిటో తెలుసుకోవాలని "అసలా అమ్మాయి ఏం చేసింద"ని అడిగాను. అదే మహాపరాధమన్నట్టు విరుచుకుపడింది.

"ఏం చేయడమేమిటండీ, మీరు మరీ నెమ్మదిగా అడుగుతున్నారు. ఊరంతా భగ్గుమంటుంటే ఇంకా ఇంట్లోనే కూర్చుని నన్ను అడుగుతున్నారు" అంటూ నన్ను మరింత సస్పెన్స్‌లో పడేసింది. 'ఇదేమిటబ్బా! ఊరు భగ్గుమనడమేమిటి?' నిఘంటువుల్లో నాకు తెలిసిన పరిజ్ఞానం మేరకు "ఏదైనా అగ్నిప్రమాదమా" అన్నాను జంకుతూనే!

"అయ్యో నా తలరాత! ఆ రామబ్రహ్మంగాడు లేడూ! మీ స్కూల్లోనే టీచరుగిరి వెలగబెడుతున్నాడు. వాడితో లేచిపోయిందటండీ. ఏమిటో అవ్వాట. ప్రేమట. ఇంతమంది వున్నారు వాడే దొరికాడా దీనికి! ఓ కులమా! స్థలమా! ఎలాంటి శ్రోత్రియ వంశంలో పుట్టింది. చివరకు ఆ కులంగాని కులంవాడితోనా పోవడం"

ఇదా జరిగింది! వాళ్లిద్దరూ అప్పుడప్పుడు కలిసి తిరుగుతుండడం నేనూ చూశాను. బహుశా పెళ్లి చేసుకుంటారేమోనని కూడా అనుకున్నాను. ఆ కుర్రాడు బుద్ధిమంతుడు. చురుకైనవాడు. స్వయంకృషితో చదువుకుని ఓ ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతని సత్ప్రవర్తనకు 'మంచి బాలుడు సోము' లెవల్లో మా ఆవిడ సర్టిఫికట్లు కూడా ఇచ్చేసింది. "ఆహా! కుర్రాడంటే అలా వుండాలి" అంటూ తెగమెచ్చుకోళ్లు కూడా ఆమె నోటనే విన్నాను. ఇపుడు రామబ్రహ్మం 'గాడ'య్యాడు. విధిలీల ఇదే కాబోలు!

"అయినా అతను మంచివాడే కదే. నీవుకూడా అతన్ని మహా బుద్ధిమంతుడని తెగపొగిడే దానివి" అన్నాను ఉండబట్టలేక.

"మంచితనం మంట్లోగలిసినట్టే వుంది లెండి. దానికి మీ వత్తాసొకటా! లెండి లెండి. ఎవరెక్కడ పోతే మనకేమిటిగాని, పెళ్లి పలకరించి వద్దాం" అంటూ లేచింది.

"ఎవరినే పలకరించడం. వాళ్లు శుభమా అని పెళ్లి చేసుకుంటే ఎవరో పోయినట్టు పలకరింతలేమిటి"

"అదేం పెళ్లండీ. పాపం! కులంగాని కులంవాడితో లేచిపోతే పెళ్లా ఏమిటి! మీరు రాకండి. నేను వెళ్తాను" అంటూ బయటకు నడిచింది.

అక్కడేం మాటలు వుంటాయో నాకు తెలుసు. "అయ్యో! ఇలా జరుగుతుందని అనుకున్నామా. ఏదో అయిందేదో అయిందిలెండి. మనవాళ్లు మనకు కాకుండా పోతారా. మన పెద్దరికం మనం నిలుపుకోవాలి. అదికాస్తా కాక ముందే మూడుముళ్లు వేయించండి" అంటూ సానుభూతి... స్వాతంన వచనాలు పలకటం; వాళ్లు దిగాలు మొగాంతో ఏదో చెప్పడం; బయటకు వచ్చాక అమ్మలక్కలతో దీనికి అందమైన కల్పనలతో రంగు రంగుల కథల్లడం మామూలే.

ఈ సంఘటన జరిగిన రెణ్ణెల్లకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే మా పెద్దబ్బాయి నుంచి ఉత్తరం వచ్చింది.

పూజ్యులైన అమ్మా, నాన్నగారికి

నమస్కారములు.

ఈ ఉత్తరం చదివాక మీరు నాపై కోపం తెచ్చుకోవచ్చు. అయినా తెలియపరచడం నా కర్తవ్యం.

నేను ఇక్కడే మా ఆఫీసులో పనిచేసే సుధ అనే అమ్మాయిని బుధవారంనాడు పెళ్లి చేసుకోబోతున్నాను. మీకు ఈ ఉత్తరం అందేసరికి మా వివాహం అయిపోతుంది. ఆ అమ్మాయిది మన కులం కాదు. కాని చదువుకున్న వ్యక్తే కాక మంచి మనసున్నావిడ. ఆమె తల్లిదండ్రులు ఇక్కడే వుంటున్నారు. ముందుగా తెలిపితే మీరు అంగీకరించరని ఇలా చేస్తున్నాను. మీ మనసు నొప్పించినందుకు మన్నించండి.

సోమవారం కృష్ణాకు ఇంటికి వస్తున్నాను.

మీ ఆశీస్సులు కోరుతూ–

రమణ.

హైదరాబాద్

